నిరుపయోగంగా సంపద కేంద్రాలు

- నియోజకవర్గంలో 88 సంపద సృష్టి కేంద్రాల నిర్మాణం
- లక్షలాది రూపాయల వ్యయం
- గ్రామాల్లో చెత్త సేకరణ అంతంతమాత్రం

నూజివీడు: అధికారుల ముందుచూపు లేమి పాలకుల నిర్లక్ష్యం వెరసి గ్రామ పంచాయతీల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఉపాధి హామీ పథకం నుంచి భారీగా నిధులు కేటాయించి పనులు పూర్తి చేసినా.. ఆశించిన ఫలితాలు మాత్రం లేదు. నూజివీడు నియోజకవర్గంలోని 88 పంచాయతీలు ఉన్నాయి. చిన్న పంచాయతీల్లో రూ. 8 లక్షలతో, పెద్ద పంచాయతీల్లో రూ. 12 లక్షలు వ్యయం చేసి షెడ్లు నిర్మించారు. గ్రామాల్లోని వ్యర్థాలను సేకరించి ఆయా పంచాయతీల్లో ఏర్పాటు చేసిన ఘన వ్యర్థ నిర్వహణ కేంద్రాలకు తరలించి నాణ్యమైన సేంద్రియ ఎరువులు తయారు చేసి రైతులకు, ప్రజలకు విక్రయించాలన్న లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేశారు. లక్ష్యానికి దూరంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఉన్నాయి. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. ఈగలు, దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నూజివీడు మండలం పాత రావిచర్లలోని సంపద సృష్టి కేంద్రం



నూజివీడు మండలం గొల్లపల్లిలో కూలడానికి సిద్ధంగా ఉన్న సంపద సృష్టి కేంద్రం

వేతనాలు ఇవ్వక.. చెత్త తరలించక

గ్రామాల్లో ఉత్పత్తయ్యే చెత్తను ఆయా పంచాయతీల్లో నియమించిన గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ తిరిగి సేకరించాలి. ఇలా సేకరించిన చెత్తను సంపద సృష్టి కేంద్రానికి తరలించాలి. అధిక శాతం గ్రామాల్లో చెత్తను సేకరిస్తున్న దాఖలాలు లేవు. మండలంలో ఒకటి, రెండు గ్రామాల్లో మాత్రమే చెత్తను సేకరిస్తున్నారు. చెత్తను సేకరించి కేంద్రానికి తరలించడానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రిక్షాలను అందజేశారు. గ్రీన్ అంబాసిడర్‌లకు నెలకు రూ.6 వేల వేతనాన్ని పంచాయతీ నిధుల నుంచి చెల్లించాల్సి ఉంది. పంచాయతీల ఆదాయం అంతంతమాత్రంగా ఉండటంతో వారికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేయాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయకపోవడంతో గ్రీన్ అంబాసిడర్‌లకు జీతాలు చెల్లించడం లేదు. దీంతో గ్రామాల్లో చెత్త సేకరణ మూలన పడింది. స్థోమత ఉన్న కొందరు సర్పంచులు మాత్రం జీతాలను వారు చెల్లించి నిధులు వచ్చిన తరువాత తీసుకుంటున్నారు. పంచాయతీల్లో చెత్త సేకరణ మొక్కుబడిగా సాగుతోంది. నూజివీడు మండలం గొల్లపల్లిలో చెరువు అంచున నిర్మించిన సంపద సృష్టి కేంద్రం బీటలు వారి కూలిపోయే దశలో ఉంది. మొర్సపూడిలో సైతం చెరువులోనే సంపద సృష్టి కేంద్రాన్ని నిర్మించారు. దీంతో చెరువు నిండితే అందులోకి వెళ్లడానికి వీలుకాదు.

జీతాలు ఇవ్వడానికి నిధులు లేవు



గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు ఇవ్వడానికి పంచాయతీలో నిధులు లేవు. ప్రభుత్వం గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత 15వ ఆర్థిక సంఘం నిధులను ఇంత వరకు విడుదల చేయలేదు. పంచాయతీ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి కూడా ఇబ్బందిగా ఉంది. పనులు ఆగకూడదని సొంత డబ్బులు ఖర్చు చేస్తున్నాం.

– కుంటం ఉదయరాజు,
సర్పంచి, బోర్వంచ, నూజివీడు మండలం

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 18న ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందిస్తే వాటిని సంబంధిత అధికారులకు పంపి గడువులోగా పరిష్కరిస్తామని చెప్పారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

విస్సన్నపేట: భగవాన్ సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పుట్రేల గ్రామంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం మంగళవారం నిర్వహిస్తామని ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద తుసూరి జయరాజు ఇంటి ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నూజివీడు గిఫర్డు మెమోరియల్ హస్పటల్ కంటి వైద్యులు రోగులను పరీక్షిస్తారని చెప్పారు. శుక్లాలు ఉన్న వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు.

సహకార సంఘాల చైర్మన్ల ప్రమాణ స్వీకారం

విస్సన్నపేట: స్థానిక శ్రీరామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా కంభంపాటి బద్రీనాథ్, కలగర సహకార సంఘం చైర్మన్‌గా దొడ్డా నరసింహారెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. వారిని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో కార్యదర్శి చెరుకు ఆంజనేయరావు, కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రుద్రవరంలో ముత్యాలమ్మ జాతర



మైలవరం: రెడ్డిగూడెం మండలం రుద్రవరం గ్రామంలోని ముత్యాలమ్మ వారికి గ్రామస్తులు ఆదివారం జాతర నిర్వహించారు. అమ్మవారిని నూతన వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. పాడి, పంటలు సమృద్ధిగా పండాలని, తమ కోర్కెలు నెరవేరాలని కోరుకున్నారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు రేగళ్ళ రఘునాథరెడ్డి, ఉప సర్పంచ్ భీమిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి, నిర్వాహకులు బొమ్మారెడ్డి రామచంద్రారెడ్డి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

950 మందికి వైద్య పరీక్షలు



తిరువూరు.జన విజ్ఞాన వేదిక తిరువూరు ఆధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఫిట్స్ రోగులు 950 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. రోగులు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు. డాక్టర్ సత్యతేజ, డాక్టర్ వి. రవీంద్ర, డాక్టర్ లక్ష్మణరావు, మదర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ టెక్నాలజీ విద్యార్థులు, జన విజ్ఞాన వేదిక నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ భవనం ప్రారంభం



కలగర(విస్సన్నపేట): కలగర గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రైతు సేవా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ ప్రసాద్, పీఆర్ డీఈ లక్ష్మణరావు, సర్పంచ్ దేశిరెడ్డి రమ, సచివాలయ నిర్మాణ స్థలదాతలు ములగలపాటి మాధవరావు, తుమ్మలపల్లి చెన్నారావు, భీమిరెడ్డి వెంకటరెడ్డి, కోపూరి లోకేశ్వరరావు, చవ్వా సుబ్బారావు, రావుల చెన్నకేశవరావు, కోపూరి తిరుపతిరావు, సొసైటీ అధ్యక్షుడు దొడ్డా నరసింహారెడ్డి, ఎస్ఆర్ఐ వల్లభనేని గిరి పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు నిలిపివేయడం దుర్మార్గం



ఇబ్రహీంపట్నం: సర్వే పేరుతో దివ్యాంగుల పింఛన్లను ప్రభుత్వం నిలిపివేయడం దుర్మార్గమని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కోట దానియేలు మాదిగ అన్నారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలపై ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెరిఫికేషన్ పేరుతో నిలిపివేసిన పింఛన్లు తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్లు లేని దివ్యాంగులకు నివేశన స్థలాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించాలని, సదరం శిబిరాల ద్వారా దివ్యాంగులకు సర్టిఫికెట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు నూర్ బాషా, మహిళా నాయకురాలు గండేటి సుజాత నాయుడు, మొండితోక విజయ్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల వైద్య సేవలు అభినందనీయం



ముసునూరు:విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులుగా తీర్చిదిద్దిన విద్యాలయం కోసం పూర్వ విద్యార్థులు వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని బాలికల గురుకుల ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి అన్నారు. వైద్య వృత్తిలో స్థిరపడిన ముసునూరు బాలికల గురుకుల పూర్వ విద్యార్థినులు ఆరుగురు ఆదివారం విద్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రసూతి వైద్య నిపుణులు శారద, కవిత, శస్త్ర చికిత్సా నిపుణులు శాంతి వర్ధిని, ధనలక్ష్మి, దంత వైద్య నిపుణులు భాగ్యలక్ష్మి, సుధ 480 మంది బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పాఠశాలలో మందులు నిల్వ చేసుకునేందుకు రిఫ్రిజిరేటర్, క్రీడా సామగ్రి అందజేశారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనకు శ్రమించిన కొఠారి

ఏఐటీయూసీ నేత చలసాని వెంకట రామారావు

నూజివీడు: అసంఘటిత రంగ కార్మికుల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించిన కార్మిక నాయకుడు కొఠారి నరసింహారావు ఆదర్శప్రాయుడని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు పేర్కొన్నారు. కొఠారి నరసింహారావు వర్ధంతి కార్యక్రమం ఆదివారం నూజివీడులోని కార్మిక భవన్ వద్ద నిర్వహించారు. కొఠారి విగ్రహానికి చలసాని రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నూజివీడులో 25 ఏళ్ల క్రితం యూనియన్‌లను స్థాపించి కార్మికుల జీవనోపాధికి కొఠారి బాటలు వేశారన్నారు. రాష్ట్ర స్థాయిలో ఆర్టీసీ పోర్టర్స్ యూనియన్, సివిల్ సప్లయ్ యూనియన్ స్థాపన కొఠారు చొరవతోనే జరిగాయన్నారు. ఆయన చూపిన మార్గంలో కార్మికులు పయనించాలని కోరారు. ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, నూజివీడు ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రామారావు తదితరులు

అరకొర పథకాలతో కూటమి ప్రభుత్వం మోసం

పైడూరుపాడు(విజయవాడరూరల్): సంక్షేమ పథకాలను అరకొరగా అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బయ్యారపు రవికిశోర్ అన్నారు. పైడూరుపాడు గ్రామ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్నా బుడమేరు ముంపు నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందన్నారు. ఉచిత గ్యాస్ తుస్సుమనిపించారని, ఆడబిడ్డ నిధి పథకం, నిరుద్యోగ భృతి అమలు చేయలేకపోయిందని విమర్శించారు. అన్నదాత సుఖీభవ కొందరికి మాత్రమే పెట్టుబడి సాయం అందిందని చెప్పారు. ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పైడూరుపాడు గ్రామ కన్వీనర్‌గా వేముల సీతారామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శులుగా ధార రాజేష్, కొనతల గోపయ్య, మంద జయరాజు, వద్ది శ్రీనివాసరావు, మరో నలుగురు కార్యదర్శులుగా నియమితులయ్యారు. నాయకుల వేముల సతీష్, ఆర్. సాంబశివరావు, చెరుకూరి శ్రీనివాసరావు, డొక్కా వెంకటరత్నం, పరికెల శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీతారామయ్యను అభినందిస్తున్న నాయకులు

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను హైస్కూల్ 1990–1995 సంవత్సరాల మధ్య ఆరు నుంచి పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా విద్య నేర్పిన గురువులు ఆచంట రవికుమార్ దంపతులను సన్మానించారు. ఆత్మీయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ సౌత్ ఏసియన్స్ గేమ్స్‌లో లాంగ్ జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో పోటీల్లో మూడు స్వర్ణ పతకాలు సాధించిన వారి మిత్రుడు రాళ్లపర్ల రమణయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎం. కిష్టాఫర్, సాయిబాబా కమిటీ అధ్యక్షులు ఊటుకూరు నారాయణరావు, హైస్కూల్ యాజమాన్య కమిటీ అధ్యక్షుడు ఆదూరి ఆంజనేయులు, సంగెపు దేవసహాయం పాల్గొన్నారు.



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

అంకమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ముసునూరు: మండలంలోని గోపవరం బీసీ కాలనీలో మల్లాది వంశీకుల ఇలవేల్పు అంకమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ఆదివారం రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి భూమి పూజ చేశారు. అంకమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం పాడి పంటలతో వర్ధిల్లాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కంచర్ల వాణి, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి గణేష్, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం..

ముసునూరు: మండలంలోని చెక్కపల్లి దివాణం సెంటర్‌లో కొలువై ఉన్న గ్రామదేవత అంకమ్మ తల్లి గ్రామోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారి మూర్తులకు అభిషేకాలు చేశారు. అనంతరం చీర, సారె, పసుపు కుంకుమ, గాజులు సమర్పించారు. కమిటీ పెద్దల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.



గోపవరంలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి పార్థసారథి

బుడమేరు పరీవాహకమంతా సిల్టు తొలగించాలి

పటమట(విజయవాడతూర్పు): బుడమేరు ప్రవాహంలో ఎటువంటి అడ్డంకులు లేకుండా వెంటనే సిల్టు తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది రామవరప్పాడు పంచాయతీ పరిధిలోని ఎల్ఎల్‌వీ గ్రాండ్ వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించారన్నారు. నగర పరిధిలో బుడమేరులో ఉన్న సిల్టు తొలగించినప్పటికీ శివారు ప్రాంతాల్లో తొలగించకపోవటంతో వరద ప్రవాహం నెమ్మదిగా జరుగుతుందన్నారు. దీన్ని గమనించిన తాము వెంటనే డ్రోన్ల సహాయంతో ఎక్కడెక్కడ ప్రవాహానికి అడ్డుగా గుర్రపుడెక్క ఉన్నదో గుర్తించి వెంటనే తొలగించేందుకు యంత్రాలను వినియోగిస్తున్నామన్నారు. బందరు, ఏలూరు, రైవస్ కాలువలు నగర పరిధిలో ఉన్నప్పటికీ శివారు ప్రాంతాల్లో కూడా ఇలాంటి స్థితే నెలకొందని, దీన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు.



రామవరప్పాడు వద్ద బుడమేరులో గుర్రపుడెక్కను యంత్రాలతో తొలగిస్తున్న సిబ్బంది

కాలనీ సమస్యలపై దృష్టి పెట్టండి సారూ!

- వర్షానికి మునుగుతున్న రోడ్లు
- వెలగని వీధి దీపాలు
- విష సర్పాల సంచారంతో భయాందోళన

ఆగిరిపల్లి: విజయవాడ రోడ్డులోని జగనన్న కాలనీ వాసులు సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ఆగిరిపల్లి నుంచి విజయవాడ రోడ్డులోని జగనన్న కాలనీలో పేదలకు సుమారు 80 మందికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నివాస స్థలాలు ఇచ్చి గృహాలు మంజూరు చేసింది. ఈ కాలనీలో 40 కుటుంబాల వారు గృహాలను నిర్మించుకుని నివాసముంటున్నారు. మరికొన్ని గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాలనీలో సమస్యలను పట్టించుకునే నాథుడే లేడు. గత వారం రోజుల క్రితం కురిసిన వర్షాలతో కాలనీ రోడ్డు పూర్తిగా కోసుకుపోయి చెరువును తలపిస్తోంది. కాలనీవాసులు బయటకు రావడానికి కూడా అవకాశం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు బయటికి వెళ్లే అవకాశం లేకపోవడంతో మోకాలి లోతు నీళ్లలో నడవవలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద ఎక్కువగా ఉంటోందని, దీనివల్ల జ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాలనీలో ఉన్న బోర్ మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించడంతో గృహ అవసరాలకు, తాగడానికి నీటిని డబ్బులు పెట్టి కొనుక్కుంటున్నామని చెప్పారు. రాత్రిపూట వీధి దీపాలు సైతం వెలగకపోవడంతో విష సర్పాల సంచారంతో భయమేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి విజయవాడ రోడ్డులోని జగనన్న కాలనీ వాసుల సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



కాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



ముసునూరు: పేదల వైద్య అవసరాలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ బీపీ సత్యనారాయణ అధ్యక్షతన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 18 మంది బాధిత కుటుంబాల వారికి రూ.12,94,819 విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు పాల్గొన్నారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

మైలవరం: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఇద్దరు సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. మైలవరం ఏఎంసీ చైర్ పర్సన్ పానకళ్ల నవ్యశ్రీ, వెల్వడం పీఏసీఎస్ చైర్మన్ పురమా సతీష్, మైలవరం ఎస్ఐ సుధాకర్, పలువురు నాయకులు జర్నలిస్టులకు అభినందనలు తెలిపారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు. వెంకట్రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చండీ ప్రసాద్, సభ్యులు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



ముసునూరు: ముసునూరు హైస్కూల్ 2004–2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు తుక్కులూరు వృద్ధాశ్రమంలో 100 మంది వృద్ధులకు ఆదివారం భోజనం ఏర్పాటు చేశారు. మిత్రులంతా కలిసి వృద్ధులకు స్వయంగా వడ్డించి, ఆరోగ్య, మానసిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మిత్ర బృందం సభ్యులు మాట్లాడుతూ ప్రతి నెలా మూడో ఆదివారం వృద్ధులకు ఆహార పదార్థాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సభ్యులు టి. శ్రీనివాసరావు, మద్దాల అంబ్రోస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

తిరుమలగిరి(జగ్గయ్యపేట):గ్రామంలో వేంచేసియున్న వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన రాచమంటి శంకర్ దంపతులు రూ. 25,116లను విరాళంగా అందించినట్లు ఈవో సాంబశివరావు ఆదివారం తెలిపారు. దాతలకు పూజల అనంతరం స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో తిరునగరి రామకృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ఆగిరిపల్లి: దుకాణదారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి జె. భవాని హెచ్చరించారు. ఆగిరిపల్లి, నెక్కలం గొల్లగూడెం, కొత్త ఈదరలోని ఎరువుల దుకాణాలను ఆదివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులకు ఎరువులను విక్రయించిన వెంటనే రశీదులు ఇవ్వాలని, ఈపోస్ మిషన్ ద్వారా ఎరువుల విక్రయాలు చేపట్టాలని, స్టాక్ వివరాలు రికార్డులు పొందుపరచాలని ఆదేశించారు. మండలంలో యూరియాతోపాటు అన్ని ఎరువులు అందుబాటులో ఉన్నాయని, డీలర్లు ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమెతోపాటు తనిఖీల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కేసులు

ముసునూరు: రైతులకు యూరియా, ఎరువుల సరఫరాలో కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, కేసులు నమోదు చేస్తామని నూజివీడు డివిజన్ వ్యవసాయాధికారి జి.విద్యాసాగర్ దుకాణదారులను హెచ్చరించారు. ఆదివారం మండల వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి, వ్యవసాయ సిబ్బందితో కలిసి చెక్కపల్లి, చింతలవల్లి, రమణక్కపేటల్లోని పీఏసీఎస్‌లు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వాయిస్‌లు, బిల్లు పుస్తకాలను, స్టాకును సైతం పరిశీలించి పలు సూచనలు చేశారు.



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న డివిజన్ వ్యవసాయాధికారి విద్యాసాగర్



ఆగిరిపల్లిలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ భవాని

సీపీఐ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు: ఒంగోలులో ఈనెల 20 నుంచి 25 వరకు నిర్వహించనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను ఆదివారం నూజివీడు అమర్ భవన్ వద్ద ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఒంగోలులో జరుగనున్న రాష్ట్ర మహాసభలు భవిష్యత్ ప్రజా ఉద్యమాలకు వేదిక కానున్నాయన్నారు. ఈ మహాసభల్లో ఎంపికయ్యే రాష్ట్ర సీపీఐ నూతన నాయకత్వం మహాసభ వేదికగా రాష్ట్ర భవిష్యత్‌కు మార్గదర్శకత్వం చేసే పద్ధతిలో పలు తీర్మానాలను ఆమోదిస్తుందని చెప్పారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, నాయకులు గంట సుబ్బారావు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు